# అనగనగా ఒక కథ

జ్ఞం

''యేంటి మామా అలా వున్నావ్?''

''ఎలా ఉన్నాను నీ ఇష్టం ఒచ్చినట్టు నేనుండాల్నా''

''కాకలో వున్నావ్ నీ మేస్త్రీ కేకలేశాడా?''

''నీకెందుకే ప్రతిదీ నీతో చెప్పాలా?''

కథ ఏదో అడ్డం తిరిగిందని గమనించింది యాదమ్మ. ఏదో కూలీ నాలీ చేసుకుని కడుపు నింపే మొగుడ్ని కసురుకునేలా చేస్తాడు ఆ మేస్త్రీగాడు.

పాపం మొగుడేం చేయగలడు. ఆడిమీద అరవలేడు. ఆ కోపమంతా నా మీద తీర్చుకుంటాడు అనుకుని సర్దుకుంది యాదమ్మ. చిన్న చేపల్ని మింగడానికి ఇంకో పెద్ద చేప వున్నట్టు 'తను తిట్టుకోడానికి నేనున్నాను' అని అనుకుంది యాదమ్మ.

★ ★ ★

''మేస్త్రంటే కూలీవాళ్లని అదుపులో పెట్టుకోవాలి. వాళ్లని గదమాయిస్తేగానీ పనులవ్వవని చాలాసార్లు చెప్పాను నీకు. నువ్వు బుసకొట్టకపోతే వానపాము కూడా కరుస్తుంది. పనిచేయించడం చాతవడమే.. పనివాడి లక్షణం. చేతకాకపోతే నువ్వు కూలీల్లో జేరితే జేరు - వేరే మేస్త్రీని పెట్టుకుని నేను పని పూర్తి చేస్తా''

కాంట్రాక్టర్.. అన్న మాటలు చెవుల్లో గింగిర్లు ఎత్తుతున్నాయ్. మేస్త్రీ మాధవరావ్‌కి-

'తనని కూలీగా మారమంటాడా?'

## కూలి



అని ఆవేదన పడుతున్న మాధవరావ్ - చిన్న చేపలమీద విరుచుకుపడ్డాడు. ఫలితంగానే యాదమ్మలాంటివాళ్లు, వాళ్ల భర్తలాటివాళ్ళు ఇబ్బంది పడ్తున్నారు. నిజం చెప్పాలంటే ఇది ఇబ్బందీ అనలేం-

ఇది నైజం- మానవ నైజం-



మనిషి అణిగిపోతున్నప్పుడు అశక్తితో దుర్జనుడిగా మారుతాడు..

కాంట్రాక్టర్ శ్రీనివాస్ అన్న మాటలకి తిట్టిన తిట్లకి కుదేలైపోయిన మాధవరావ్ కూలీల మీద విరుచుకుని పడడం సహజమే. పదిహేనేళ్లబట్టి శ్రీనివాస్‌గారి దగ్గరే పని చేస్తున్న మాధవరావ్ ఈవాళ పడిన మాట ఎప్పుడూ అనిపించుకోలేదు. అహం దెబ్బతిని దాన్ని బతికించుకోటానికి బార్లో ఈదులాడి సాయంత్రం కూలీల మీద విరుచుకుపడ్డాడు-

జీతంలో కోతలు పెట్టాడు-

పనిగంటలు పెంచాడు-

ఇంటికెళ్లాక.. నిజంగానే రోజు గడవని కూలీలకి అన్యాయం చేస్తున్నానా? అనే బాధతో సతమతమయ్యాడు మాధవరావ్. వాళ్ల కడుపుకోస్తున్నందుకు కొంత సేపు బాధపడిన తన పై కూలీ.. అదే కాంట్రాక్టర్‌గారు 'గయ్యి' మనడంతో.. 'గయ్యి' అనడం నేర్చుకున్నాడు. ఎంతో మంది కూలీలు ఇళ్లల్లో తనని శపిస్తుంటారోనని మాధవరావ్‌కి తెలుసు.

ఆ బాధ తెలియకుండానే బారు మత్తిచ్చింది.

తనకున్న అనుభవంతో తనే కాంట్రాక్టర్ అయిపోవచ్చు కాని శ్రీనివాస్‌గార్ని ఇన్నాళ్లుగా నమ్ముకుంటున్న పెద్ద కూలీ అతను.

★ ★ ★

కాంట్రాక్టర్ శ్రీనివాస్ ఇంటికి.. బిల్డర్ రాజారావు వెళ్లకపోతే ఇంతమందికి ఇంత క్షోభ కలిగేది కాదు. ఆ ఓనరు పెద్ద చేప. ఎన్ని చిన్ని చేపలు వాటికన్న చిన్న చేపల్ని మింగేశాయో. ఆయనకి అనవసరం-

కొత్త కాంట్రాక్టర్‌ని వెతికైనా తొరగా బిల్డింగ్ పూర్తి చేయాలని రాజారావు తూగుటుయ్యాలలో కూర్చుని ఆలోచనలో ఉండగా కాంట్రాక్టరు శ్రీనివాస్ వచ్చాడు. 'మేస్త్రీ మాధవరావ్ ఉరేసుకుని చనిపోయాడటండీ' అనే వార్త మోసుకొచ్చాడు.

రాజారావు షాక్ అయ్యాడు.

''అందుకు కారణం నువ్వే కదా?''

''కాదండీ మనం..''

''ఏమిటంటున్నావ్''

''నేను మీ కింద కూలీని- అతను నా కింద కూలీ. అతని కింద.. ఎంతోమంది కూలీలు!! మీకివ్వాళ లాభం చేద్దామని నేను దోషినయ్యాను'' అంటూ శ్రీనివాస్ మాట్లాడుతున్న ప్రతి మాటా బిల్డర్‌కి చెంప దెబ్బల్లాగే తగిలాయ్-

నిజం చెప్పాలంటే శ్రీనివాస్ చెంపదెబ్బలు కొట్టలేదు- చెంపలు వాయించుకున్నాడు. రాజారావు దగ్గర పని చేయొద్దని నిర్ణయించుకున్నాడు. గుడ్‌బై చెప్పి వెళ్లిపోయాడు-

మాధవరావ్‌ని తనే హత్య చేశానని అతని మనసు నొక్కి చెప్తోంది. కాని అందుకు కారణం రాజారావే అని కూడా అనిపిస్తోంది.

కనుక శ్రీనివాస్ రాజారావుని తిట్టటానికొచ్చాడు.

★ ★ ★

రాజారావుకి తన తప్పు తెలిసేటప్పటికి.. కాంట్రాక్టర్ శ్రీనివాస్ రిజైన్ చేసి వెళ్లిపోయాడు.

కూలీలెవ్వరూ పనిలోకి రానన్నారు.

రాజారావు ఎక్కడ నుంచైనా పిలిపించి కూలీల్ని, మేస్త్రీల్ని తెచ్చుకోగలడు. కానీ మాధవరావ్ జ్ఞాపకంగా ఆ బిల్డింగ్‌ని అసంపూర్తిగా వదిలేశాడు.

ఇప్పటికీ ఆ మొండిగోడల బిల్డింగ్‌ని దెయ్యాల మేడ అని పిలుస్తుంటారు.

ముప్పయ్ ఏళ్లబట్టీ ఆ వేళ వాడిన గమేళాలు, పారలూ కూడా తీసుకోడానికి ఎవరూ రాక అక్కడే శిథిలమైపోయాయి.

రాజారావు ఆ ప్రొఫెషన్ వదిలేసి సంపాదించిన సొమ్ములతో బ్రతుకు గడిపేస్తున్నాడు.

ఆ దయ్యాల మేడ రోడ్డుమీద నుంచి మాత్రం వెళ్లడు.

☆

## పెళ్లి కూడా వ్యాపారమే!

**అభిషేక్-ఐశ్వర్యల పెళ్లికి ఎంత క్రేజ్ వచ్చిందో అందరికీ తెలుసు. అలాంటి క్రేజ్‌ని కూడా క్యాష్ చేసుకున్నారని తాజా వార్తలు చెబుతున్నాయి. ఎలాగంటారా? వాళ్ల పెళ్లికి సంబంధించి వీడియో, ఫొటోలు తీయడానికి మీడియా వారినెవరినీ అనుమతించని బచ్చన్ కుటుంబం వారు- బ్రిటన్‌కి చెందిన 'ట్రావెల్ అండ్ లివింగ్' చానల్‌కి దాదాపు 5 కోట్ల రూపాయలకు హక్కుల్ని అమ్మారట. సినిమాలను అమ్మినట్టే పెళ్లి కాసెట్‌నీ అమ్మడం అనేది వాళ్ల వ్యాపార దృక్పథాన్ని ఎలా తెలియచేస్తోందో! కరెన్సీయా మజాకా!**

